క్లుప్తంగా

రామలింగేశ్వరుడికి ప్రత్యేక పూజలు



పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామివారి దేవస్థానంలో సోమవారం స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి పంచామృతాభిషేకం చేశారు. అనంతరం విశేష అలంకరణ చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు సాగర్ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు స్వామివార్లను దర్శించుకున్నారు. భక్తులకు శ్రీరామలింగేశ్వర ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత ప్రసాదం అందజేశారు.

విద్యుత్ పొదుపుతో ఇంధనం ఆదా



ఉయ్యూరు: విద్యుత్ పొదుపుతో ఇంధన ఆదా అవుతుందని విద్యుత్ శాఖ ఉయ్యూరు ఈఈ కృష్ణనాయక్ అన్నారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా సోమవారం విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ఉయ్యూరు ఇంధన పొదుపుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. విద్యుత్ శాఖ కార్యాలయం నుంచి ప్రధాన సెంటరు వరకూ ర్యాలీ నిర్వహించి విద్యుత్ పొదుపుపై అవగాహన కల్పించారు. ఈఈ కృష్ణనాయక్ మాట్లాడుతూ భవిష్యత్తు తరాల కోసం ఇంధన పొదుపు చర్యలు చేపట్టాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. విద్యుత్ పొదుపు చర్యలతో ఇంధనం ఆదాతో పాటుగా ఆర్థిక భారం తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో డీఈ ఎంవీవీ రామకృష్ణ, ఏఈలు నాగమల్లేశ్వరరావు, సత్యనారాయణ, సబ్ ఇంజినీర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ



హనుమాన్‌జంక్షన్ రూరల్: గతేడాదితో పోల్చితే జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాల సంఖ్య గణనీయంగా పెరిగిందని గన్నవరం డీఎస్పీ ఆర్‌జీ జయసూర్య తెలిపారు. హనుమాన్‌జంక్షన్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఆయన వార్షిక తనిఖీ నిర్వహించారు. పోలీస్ స్టేషన్‌కు సంబంధించిన పలు రికార్డులను ఆయన పరిశీలించారు. పెండింగ్ కేసులకు సంబంధించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం డీఎస్పీ జయసూర్య మీడియాతో మాట్లాడుతూ హనుమాన్‌జంక్షన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నేరాల అదుపులో ప్రగతి సాధించినప్పటికీ, రోడ్డు ప్రమాదాలు, సొత్తు రికవరీకి సంబంధించిన కేసులు అత్యధికంగా నమోదు అవుతున్నాయని చెప్పారు. సొత్తు రికవరీతో సహా పెండింగ్ కేసులను వచ్చే నాలుగు నెలలలో పూర్తిగా పరిష్కరిస్తామని ఆయన తెలిపారు. హనుమాన్‌జంక్షన్ సీఐ అల్లు నవీన్ నరసింహమూర్తి, ఎస్ఐలు ఏడీఎల్ జనార్దన్, టి.తిరుమలరావు పాల్గొన్నారు.

పాత కక్షతో వ్యక్తిపై దాడి

పెనమలూరు: కానూరులో పాత కక్షలతో వ్యక్తిపై మరో వ్యక్తి దాడి చేయటంతో పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కానూరు కామినేనినగర్‌కు చెందిన ఉల్లిపల్లి జయరామ ఆదివారం బల్లెంవారి వీధిలో టీస్టాల్ వద్దకు టీ తాగటానికి రాగా అక్కడే ఉన్న శివకుమార్ పాతకక్షల కారణంగా తగాదాపడి జయరామపై ఇనుప కడియంతో కడుపులో దాడి చేసి గాయపరిచాడు. గొడవ జరిగిన తర్వాత జయరామ ఇంటికి వచ్చి కడుపులో నొప్పిగా ఉందని కుటుంబ సభ్యులకు తెలుపటంతో తండ్రి బలరామ కుమారుడు జయరామను విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్సకై చేర్చాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దాడి చేసిన శివకుమార్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు.

పరస్పర దాడి.. కౌంటర్ కేసులు నమోదు

పెనమలూరు: ఇద్దరు వ్యక్తులు పరస్పర దాడులు చేసుకోవటంతో పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పఠాన్ సిరాజ్‌ఖాన్ యనమలకుదురు పరిధి జన్మభూమి వంతెన డౌన్‌లో ఉంటున్నాడు. అతను ఆదివారం బైక్ పై ఇంటి నుంచి బయటుదేరి వంతెన వద్దకు రాగా రోడ్డుకు అడ్డంగా తాజుద్దీన్ అనే వ్యక్తి ఉండటంతో పక్కకు జరగమన్నాడు. దీంతో వివాదం తలెత్తి సిరాజ్‌ఖాన్ పై తాజుద్దీన్ దాడి చేశాడు. కాగా తాజుద్దీన్, సిరాజ్‌ఖాన్ గొడవపడుతున్నారని తెలుసుకున్న తాజుద్దీన్ సోదరి షేక్ షాహిదున్నీసా గొడవ ఆపి తాజుద్దీన్‌ను ఇంటికి తీసుకు వచ్చింది. అంతటితో ఆగని సిరాజ్‌ఖాన్ మరి కొందరు వ్యక్తులతో తాజుద్దీన్ ఇంటికి వచ్చి అడ్డువచ్చిన షాహిదున్నీసాపై రాయితో దాడి చేశారు. ఈ ఘటనపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కౌంటర్ కేసులు నమోదు చేశారు.

ప్రజల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం భరోసా



సీఎం ప్రసంగాన్ని వీక్షిస్తున్న ఎంపీపీ, అధికారులు



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సందేశాన్ని వీక్షిస్తున్న ఎంపీపీ ప్రసన్నకుమారి, ఎంపీడీఓ భార్గవి

గన్నవరం: ఆరోగ్యశ్రీ పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్య భద్రతకు భరోసా కల్పిస్తోందని ఎంపీపీ అనగాని రవి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఆరోగ్యశ్రీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలోని పేదలకు ఖరీదైన వైద్యం అందిస్తున్నట్లు చెప్పారు. దీనికోసం ఆరోగ్యశ్రీ పరిమితిని కూడా రూ. 25 లక్షలకు పెంచిందన్నారు. ఆరోగ్యశ్రీ స్మార్ట్‌కార్డులు, యాప్‌లు ద్వారా వైద్య సేవలు, ఆస్పత్రుల వివరాలను ప్రజలు సులభంగా తెలుసుకునే సదుపాయం కల్పించినట్లు తెలిపారు. ఈ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకునే విధంగా ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందికి సూచించారు. జెడ్పీ కోఆప్షన్ సభ్యులు ఎండీ గౌసాని, ఎంపీటీసీ సభ్యులు చిలకపాటి దుర్గ, మోరం నాగరాణి, ఎంపీడీఓ ఈ. సత్యకుమార్, ఈఓపీఆర్డీ పి. వెంకటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

దేశంలో ఎక్కడా లేని విధంగా..

విజయవాడరూరల్: రాష్ట్ర ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేని విధంగా వైద్య రంగంలో అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టిందని విజయవాడ రూరల్ ఎంపీపీ చెన్ను ప్రసన్న కుమారి అన్నారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద చికిత్సల వ్యయం రూ.25లక్షల వరకు పెంపుదల చేసిన సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సందేశాన్ని సోమవారం విజయవాడ రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి, ఎంపీడీఓ బి.భార్గవి, వైద్యసిబ్బంది వీక్షించారు. అనంతరం ఎంపీపీ ప్రసన్న కుమారి మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజలకు మెరుగైన ఉచిత కార్పొరేట్ వైద్యం అందించే విషయాన్ని వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించాలన్నారు. ఆరోగ్యశ్రీ కార్డులో పొందుపర్చిన క్యూఆర్ కోడ్‌తో లాగిన్ అవ్వడం ద్వారా రోగి చేయించుకొనే వ్యాధి నిర్ధారణ పరీక్షలు, తీసుకుంటున్న వైద్యం, చికిత్సలు ఆరోగ్య మిత్రల ద్వారా తెలుసుకునే వీలుంటుందనే విషయాన్ని ప్రజలకు వివరించాలన్నారు. ఇప్పటి వరకు విజయవాడ రూరల్ మండలంలో సుమారు 28,900 డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీలో వైద్యసేవలను అందించినట్లు ఎంపీడీఓ బి.భార్గవి తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ మాధురి, వైద్యసిబ్బంది పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



సూరంపల్లిలో మెగా ఆరోగ్యశ్రీ ప్రారంభోత్సవంలో పాల్గొన్న అధికారులు, సిబ్బంది

ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డులపై అవగాహన

ఉంగుటూరు: డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఇక నుంచి రూ.25లక్షల వరకు వైద్య సేవలు పొందవచ్చని ఎంపీడీవో శేషగిరిరావు అన్నారు. వెన్నూతల గ్రామంలో రూ.25లక్షల పెంపుతో వచ్చిన వైఎస్సార్ ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డులపై అవగాహన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట వేసి రూ.25లక్షలకు పెంచడం పేదల ఆరోగ్యానికి వరం అని అన్నారు. ఆరోగ్యశ్రీ పథకంతో ఇప్పటి వరకు లక్షలాది మంది ప్రజలు లబ్ధిపొందారని అన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులలో 3,257కు పైగా రోగాలకు సేవలు అందిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ రామ్మోహన్‌రావు, ఈవోపీఆర్‌డీ అమీర్ బాషా పాల్గొన్నారు.

మెగా ఆరోగ్య శ్రీపై అవగాహన

గన్నవరం రూరల్: ఆరోగ్య శ్రీ పథకంలో రూ.25లక్షల వరకూ ఉచిత వైద్యాన్ని అందించే బృహత్తర కార్యక్రమ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని మండలంలోని గ్రామ సచివాలయాల వద్ద సోమవారం అధికారులు, పంచాయతీ సిబ్బంది నేరుగా వీక్షించారు. మెగా ఆరోగ్య శ్రీపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని వారు తెలిపారు. సూరంపల్లిలో పంచాయతీ కార్యదర్శి కోట సురేష్ బాబు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఉయ్యూరు: రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. ఉయ్యూరు మార్కెట్ యార్డు ఆవరణలో రూ. 71 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులకు సోమవారం భూమిపూజ చేశారు. పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ రైతులకు మార్కెటింగ్ సొసైటీలను అందుబాటులోకి తెచ్చామన్నారు. మార్కెట్ కమిటీల ద్వారా రైతు సేవలను విస్తృత పరుస్తున్నామన్నారు. రైతులు మార్కెట్ యార్డులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్, ఏఎంసీ చైర్మన్ వల్లభనేని వెంకటేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యానారాయణ (నాని), సీడీసీ చైర్మన్ రాజులపాటి రామచంద్రరావు, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు సోలే సురేష్‌బాబు, అర్షతున్నీసాబేగం, పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ అబు కలాం పాల్గొన్నారు.



మార్కెట్‌యార్డులో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

జగనన్న పాలనలో అన్ని వర్గాల అభివృద్ధి



సదస్సులో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యులు కాకర్లమూడి సువర్ణరాజు

రామవరప్పాడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్న సువర్ణ పాలనలో రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు అభివృద్ధి చెందుతున్నారని జెడ్పీటీసీ సభ్యులు కాకర్లమూడి సువర్ణరాజు అన్నారు. విజయవాడరూరల్ మండలం ప్రసాదంపాడు సచివాలయం-1లో సోమవారం 'ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలి' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంక్షేమ బోర్డు క్యాలెండర్‌ను, వైఎస్సార్‌సీపీ పార్టీ జెండాను ఏఎంసీ మాజీ చైర్మన్ కొమ్మా కోట్లు ఆవిష్కరించారు. సువర్ణరాజు మాట్లాడుతూ కుల, మత, రాజకీయాలకు అతీతంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. గొల్లపూడి మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ కొమ్మా కోటేశ్వరరావు మాట్లాడుతూ గ్రామంలోని సచివాలయం -1 పరిధిలో నాలుగున్నర సంవత్సరాలల్లో లబ్ధిదారులకు నేరుగా రూ. 38.47 కోట్ల లబ్ధి చేకూరిందన్నారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ శీలం రంగారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు జగన్ పాలనపై పూర్తి విశ్వాసంతో ఉన్నారని రానున్న ఎన్నికల్లో కూడా జగన్‌ను ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఆర్. వెంకటేశ్వరరావు, సచివాలయాల మండల కన్వీనర్ సాదం వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు దూరు రత్నం, పైలా లక్ష్మి, పైలా శ్రీనివాసరావు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

గ్రామ స్వరాజ్యం సాకారం..

గన్నవరం రూరల్: మండలంలోని కొత్తగూడెం గ్రామ సచివాలయం వద్ద సోమవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. సర్పంచ్ తూంపాటి రాంబాబు గ్రామానికి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల బోర్డును వైఎస్సార్ సీపీ నాయకులు, అధికారులతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజల జీవన ప్రమాణాలను సంక్షేమ పథకాలతో మెరుగు పరిచిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన ఆదర్శనీయమని చెప్పారు. కరోనా కష్టకాలంలో ప్రజలను ఆదుకున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ప్రజలందరూ అండగా ఉండాలని చెప్పారు. సమాజంలోని అన్ని వర్గాలకు పథకాలను అందజేశారని, అర్హత ప్రామాణికంగా పథకాలు లభించాయని వివరించారు. గతంలో పని చేసిన ప్రభుత్వాలు వారికి అనుకూలమైన వారికి మాత్రమే పథకాలను ఇచ్చే వారని, ఈనాడు ఆ పరిస్థితిని మార్చి, సచివాలయం, వలంటీర్‌లు వ్యవస్థను నిర్మించి గ్రామ స్వరాజ్యాన్ని ప్రతి గడపకు దగ్గర చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి వచ్చే ఎన్నికలలో అండగా నిలిచి మరోసారి ఆయనను సీఎంను చేయాలని విజ్ఞప్తి చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు అంగడాల సాంబశివరావు, వేమూరి కృష్ణారావు, కాట్రు శివశంకర్, చేకూరి ఏడుకొండలు, ఈవోపీఆర్డీ వెంకటేశ్వరమ్మ, సచివాలయం కార్యదర్శి శివలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైన్స్ ఎగ్జిబిషన్



సైన్స్ ప్రాజెక్టులు పరిశీలిస్తున్న విద్యా శాఖ అధికారులు, ఉపాధ్యాయులు



ఉంగుటూరులో ఎంపికైన విద్యార్థులతో సైన్స్ ఉపాధ్యాయులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు సైన్స్ ఎగ్జిబిషన్లు ఎంతగానో ఉపయోగపడతాయని మండల విద్యాశాఖాధికారి శ్రీరామ్ బాలాసింగ్ అన్నారు. స్థానిక నూజివీడురోడ్డులోని బాపులపాడు జెడ్పీ హైస్కూల్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మండల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఆయన ప్రారంభించారు. మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా సైన్స్ ఫెయిర్‌లో పాల్గొన్నారు. స్మార్ట్ స్కూల్, ఆటోమెటిక్ వాటర్ ప్లాంట్ సిస్టమ్, త్రికోణమితి నిష్పత్తుల ప్రాజెక్టులు విశేషంగా ఆకట్టుకున్నాయి. గ్రూప్ విభాగంలో, వ్యక్తిగత విభాగంలో, ఉపాధ్యాయుల విభాగంలో ప్రాజెక్టులు ఎంపిక చేశారు. చింతా సీతయ్య జూనియర్ కాలేజి అధ్యాపకులు బి.ఝాన్సీ, ఎం.కామేశ్వరి, కె.శారద న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. మండల విద్యాశాఖాధికారి-2 బి.సురేష్‌కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తోట వెంకట నాగేశ్వరరావు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌కు..

ఉంగుటూరు: మండల కేంద్రమైన ఉంగుటూరులో జెడ్పీ హైస్కూల్లో మండలస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ సోమవారం నిర్వహించారు. ఎంఈవో-2 సాంబశివరావు సైన్స్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. మండలంలోని 9 జెడ్పీ హైస్కూళ్ల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యక్తిగత విభాగం, టీమ్, టీచర్ విభాగంలో నుంచి జిల్లా స్థాయికి ఎంపికలు చేశారు. హెచ్ఎం సీహెచ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మండలంలోని అన్ని జెడ్పీ హైస్కూల్స్ సైన్స్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పునాదిపాడు జెడ్పీ పాఠశాలలో వైజ్ఞానిక ప్రదర్శనను తిలకిస్తున్న జెడ్పీటీసీ బాకీ బాబు

విద్యార్థులు నూతన ఆవిష్కరణలు చేయాలి

కంకిపాడు: విద్యార్థులు తమ ఆలోచనలకు పదును పెట్టి నూతన ఆవిష్కరణలు రూపొందించాలని జెడ్పీటీసీ బాకీ బాబు అన్నారు. మండలంలోని పునాదిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన సోమవారం నిర్వహించారు. ప్రదర్శనను జెడ్పీటీసీ బాకీ బాబు ప్రారంభించారు. మండల స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో వ్యక్తిగత విభాగంలో, గ్రూప్ విభాగంలో,టీచర్స్ స్థాయిలో ప్రదర్శనలు జిల్లా స్థాయికి ఎంపిక చేశారు. ఎంపీడీఓ పి.అనూష, ఏఎంసీ మాజీ చైర్మన్ మద్దాలి రామచంద్రరావు, కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ రామినేని రమాదేవి, సర్పంచ్ ఎం.విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శిగా సయ్యద్ నూరుద్దీన్



రామవరప్పాడు: వైఎస్సార్ సీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శిగా రామవరప్పాడుకు చెందిన సయ్యద్ నూరుద్దీన్‌ను నియమిస్తూ ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా రాష్ట్ర వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఖాదర్ భాషాను ఆదివారం నూరుద్దీన్ మర్యాద పూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా నూరుద్దీన్ మాట్లాడుతూ పదవి ఇచ్చిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా మైనార్టీల అభివృద్ధికి, వైఎస్సార్ సీపీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తానన్నారు.

ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

గన్నవరం: ధనుర్మాసం సందర్భంగా స్థానిక ఆర్టీసీ డిపో నుంచి ద్వారకాతిరుమల, వాడపల్లి, అన్నవరంనకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డీఎం పి. శివాజీ సోమవారం తెలిపారు. ప్రతి శనివారం ఈ బస్సులు తెల్లవారుజామున 4 గంటలకు బయలుదేరి ద్వారకాతిరుమల, వాడపల్లిలో శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానాల దర్శనం అనంతరం అన్నవరం శ్రీసత్యనారాయణస్వామి ఆలయానికి చేరుకుంటుందన్నారు. స్వామివారి దర్శనం అనంతరం బస్సు బయలుదేరి రాత్రికి గన్నవరం చేరుకుంటుందన్నారు. ఈ యాత్ర కోసం ఎక్స్‌ప్రెస్ బస్సుకు టికెట్ రూ. 700, అల్ట్రా డీలక్స్ బస్సుకు రూ. 850 చెల్లించాలని తెలిపారు. ఒకే గ్రామం నుంచి 35 మంది టికెట్లు బుక్ చేసుకుంటే అక్కడి నుంచే బస్సు బయలుదేరుతుందన్నారు.

ఆలయాల్లో ధనుర్మాస పూజలు

ఉయ్యూరు: వైష్ణవాలయాల్లో ధనుర్మాస పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. పట్టణంలోని విష్ణాలయంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పూజా కార్యక్రమాలు జరిపించారు. ధనుర్మాసం సందర్భంగా సోమవారం ఆలయ చైర్మన్ లోయ చింతయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మైనార్టీల హక్కుల రక్షణకు ప్రత్యేక చట్టాలు



సదస్సులో మాట్లాడుతున్న జడ్జి జయలక్ష్మి

గన్నవరం: మైనార్టీల రక్షణ కోసం రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి కె. జయలక్ష్మి సూచించారు. స్థానిక ఇస్లాంపేటలోని ముస్లిం షాదీఖానాలో సోమవారం మైనార్టీల హక్కుల దినోత్సవం సందర్భంగా మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జడ్జి మాట్లాడుతూ.. దేశంలో వెనుకబడిన వర్గాల్లో ఒకరైనా మైనార్టీల అభ్యున్నతికి రాజ్యాంగంలో ప్రత్యేక హక్కులు కల్పించినట్లు చెప్పారు. వీరి హక్కులకు భంగం కలిగినప్పుడు నేరుగా న్యాయస్థానాలను ఆశ్రయించవచ్చని తెలిపారు. ముఖ్యంగా 18 ఏళ్లలోపు ఆడపిల్లలకు పెళ్లిళ్లు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జాస్తి తాతారావు, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ సభ్యుడు వై. రాజశ్రీశారద, అంజుమన్ కమిటీ అధ్యక్షుడు షేక్ రఫీ, కార్యదర్శి ఎండీ. అజీజ్‌ఖాన్, కోశాధికారి కరిముల్లాఖాన్ తదితరులు పాల్గొన్నారు.

అవ్వాతాతలకు అండగా జగనన్న సర్కార్

డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పడమట స్నిగ్ధ



గోసాల వృద్ధుల ఆశ్రమంలో కేక్ కట్ చేస్తున్న పడమట స్నిగ్ధ

పెనమలూరు: రాష్ట్రంలో అవ్వాతాతలకు అండగా జగనన్న నిలిచారని డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పడమట స్నిగ్ధ అన్నారు. సోమవారం గోసాల గ్రామంలోని వృద్ధుల ఆశ్రమంలో వృద్ధుల సమక్షంలో కేక్‌కట్ చేసి వృద్ధులకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా స్నిగ్ధ మాట్లాడుతూ జగనన్న అధికారంలోకి వచ్చిన తర్వాత అవ్వాతాతలకు భరోసా ఏర్పడిందన్నారు. వృద్ధులకు వైఎస్సార్ పింఛన్ కానుక దశలవారీగా పెంచి జనవరి నాటికి రూ. 3 వేలు చేయబోతున్న ఘనత జగనన్నకు దక్కిందన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ సంగెపు శ్రీనివాసరావు,ఏఎంసీ డైరెక్టర్ పోలవరపు రవి, నేతలు షేక్ పీర్‌అహ్మద్, షేక్ నాసర్, ఎండీ ఆసిఫ్, ఎండీ దాదా, భువనగిరి వెంకటరమణ, గోపాలరావు పాల్గొన్నారు.

కిక్ బాక్సింగ్ పోటీల్లో జంక్షన్ క్రీడాకారుల ప్రతిభ




పతకాలు సాధించిన టైగర్ పవర్ కిక్ బాక్సింగ్ అండ్ కరాటే స్కూల్ క్రీడాకారులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: ఏపీ స్టేట్ కిక్ బాక్సింగ్ చాంపియన్‌షిప్-2023 పోటీల్లో హనుమాన్‌జంక్షన్‌కు చెందిన టైగర్ పవర్ కిక్ బాక్సింగ్ అండ్ కరాటే స్కూల్ క్రీడాకారులు 22 పతకాలతో సత్తాచాటారు. ఈ నెల 17వ తేదీన విశాఖపట్నం గాజువాకలోని అమరావతి పార్కులో జరిగిన ఈ రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరఫున 11 మంది టైగర్ పవర్ కిక్ బాక్సింగ్ అండ్ కరాటే స్కూల్ క్రీడాకారులు ప్రాతినిధ్యం వహించినట్లు కోచ్ కట్టా సుధాకర్ సోమవారం వివరించారు. పానుగంటి శివసాయి ఆశ్రిత్ (27 కిలోలు) కటాస్ విభాగంలో బంగారు, ఫైట్స్ విభాగంలో కాంస్య పతకం సాధించాడన్నారు. మత్తి హర్షిత (32 కిలోలు) కటాస్ విభాగంలో పసిడి పతకాన్ని సొంతం చేసుకోగా, ఫైట్స్ విభాగంలో వెండి పతకాన్ని సాధించిందని తెలిపారు. గొల్తి గోపిక (42 కేజీలు), మోటూరి సాహిత్య లక్ష్మి (43 కేజీలు) కటాస్ విభాగంలో వెండి పతకం, ఫైట్స్ విభాగంలో కాంస్య పతకాలను కైవసం చేసుకున్నట్లు చెప్పారు. కట్టా మనోజ్ (25 కేజీలు), ఆదివిష్ణు నీలమణికంఠ (55 కేజీలు), కొనకళ్ల లోకేష్ కుమార్ (55 కేజీలు), కాంచన శర్వానంద్ (44 కేజీలు), కొనకళ్ల హారిక ధనలక్ష్మి (70 కేజీలు), పిల్లి లావణ్య (26 కేజీలు), అడపా మేఘన శ్రీ హర్షిత (26 కేజీలు) కటాస్, ఫైట్స్ విభాగంలో కాంస్య పతకాలను సాధించినట్లు కోచ్ కట్టా సుధాకర్ తెలిపారు. రాష్ట్ర స్థాయిలో అత్యధిక పతకాలను సాధించిన జట్ల జాబితాలో కృష్ణాజిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించిన టైగర్ పవర్ కిక్ బాక్సింగ్ అండ్ కరాటే స్కూల్ ద్వితీయ స్థానంలో నిలిచిందని వివరించారు. వీరు వచ్చే ఏడాది జనవరి 3వ తేదీ నుంచి 6 వరకు ఢిల్లీలో జరగనున్న జాతీయ స్థాయి కిక్ బాక్సింగ్ పోటీలకు రాష్ట్ర జట్టు తరఫున పాల్గొననున్నట్లు తెలిపారు.

కులగణనకు అందరూ సహకరించాలి

పెనమలూరు: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో చేపట్టనున్న కులగణనకు అందరూ సహకరించాలని తహసీల్దార్ కట్టా వెంకట శివయ్య అన్నారు. పెనమలూరు మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం కులగణనపై కుల పెద్దలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శివయ్య మాట్లాడుతూ త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా కులగణన ప్రారంభమవుతుందన్నారు. కులగణన సమయంలో కుల పెద్దలు వారి అభిప్రాయాలు, సూచనలు తమకు తెలపాలన్నారు. ప్రతి ఒక్కరూ చెప్పిన విషయాలను పరిగణనలోకి తీసుకొని ఈ మేరకు నివేదిక ఉన్నతాధికారులకు పంపుతామన్నారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో ఎంపీడీఓ సునీతాశర్మ, కుల పెద్దలు పాల్గొన్నారు.

అయోధ్య అక్షింతలతో శోభాయాత్ర



శోభయాత్రలో పాల్గొన్న స్వామిజీ, భక్తులు

గన్నవరం: శ్రీరామ జన్మ భూమి తీర్థక్షేత్ర అభియాన్‌లో భాగంగా అయోధ్య నుంచి వచ్చిన పూజ అక్షింతలు సోమవారం మండలంలోని కేసరపల్లి శివారు శ్రీభువనేశ్వరీ పీఠంనకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పీఠాధిపతులు కమలానందభారతిస్వామి నేతృత్వంలో అక్షింతలు నింపిన కలశాలతో శోభాయాత్ర నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఈ యాత్రలో పాల్గొని శ్రీరామజపం చేశారు. ఈ సందర్భంగా స్వామిజీ మాట్లాడుతూ ఈ నెల 20న గన్నవరం రోటరీ ఆడిటోరియంలో జరగనున్న హిందూ సమ్మేళనంలో అయోధ్య శ్రీరాముని అక్షింతలను గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు మండలాలకు చెందిన భక్తులు అందజేయనున్నట్లు తెలిపారు. హిందూ సమ్మేళనం మండల కన్వీనర్ వెలుగంటి శివాజీ, సభ్యులు ఎస్. శేషుకుమార్, జయశంకర్, పాండురంగారావు, భక్తవత్సల్యం, సురేష్, శ్రీనివాస్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి రగ్బీ పోటీలకు పెదవుటపల్లి విద్యార్థి



జాతీయ స్థాయి రగ్బీ పోటీలకు ఎంపికైన విద్యార్థినితో హెచ్‌ఎం

ఉంగుటూరు: జాతీయ స్థాయి రగ్బీ పోటీలకు పెదఅవుటపల్లి జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని వై.నాగలక్ష్మి ఎంపికై నట్లు హెచ్‌ఎం కె.శేషుకుమారి తెలిపారు. స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో జాతీయ స్థాయి పోటీలలో పాల్గొననున్న విద్యార్థికి అభినందన సభ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ కర్నూలులో నవంబర్ 18 నుంచి 20వ తేదీ వరకు జరిగిన 67వ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలలో అండర్-14 విభాగంలో రగ్బీ పోటీలలో ఉత్తమ ప్రతిభకనబరచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికై ందని చెప్పారు. ఈ నెల 22న ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలలో పాల్గొంటుందని తెలిపారు. పీఈటీ రాంబాబు, సీఆర్‌పీ అమిత, ఎస్ఎంసీ కమిటీ చైర్మన్ కె.రమేష్ పాల్గొన్నారు.